క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అవగాహన

తల్లాడ: దీర్ఘకాలిక వ్యాధి అయిన క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపి మాట్లాడారు. సోమవారం ప్రచారం నిర్వహించి.. మండలంలోని అన్నారుగూడెంలో క్షయవ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో టీబీ చికిత్స సూపర్‌వైజర్ సురేష్, ల్యాబ్ సూపర్‌వైజర్ ఆర్.సంజయ్‌కుమార్, ఎఎన్ఎం పద్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఏన్కూరు: సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పంటల్లో ఆశించిన ఫలితాలు సాధించవచ్చని వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్ అన్నారు. సోమవారం వ్యవసాయాధికారులు మండలంలోని తూతక లింగన్నపేటలో వరి పొలాలను పరిశీలించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. వరిలో బ్యాక్టీరియా, ఎండు తెగులు సోకినట్లు గుర్తించడం జరిగిందన్నారు. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వార తెగుళ్లను నివారించవచ్చు. కార్యక్రమంలో ఏఓ నర్సింహారావు, ఏఈఓలు శ్రీకాంత్, బాలకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

కులగణనపై శిక్షణ

ముదిగొండ: ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు బీసీ కులగణనపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిషోర్, ఏఎస్‌ఓ సుమన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండల పరిధిలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను జగన్నాధపురం గ్రామ సమీపంలో పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

మధిర పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వైరా ఏసీపీ

మధిర: వార్షిక పోలీస్ స్టేషన్ల తనిఖీల్లో భాగంగా వైరా ఏసీపీ రెహమాన్ సోమవారం మధిర టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. దీనితో పాటు పెండింగ్‌లో తీవ్రమైన నేరాల సీడీ ఫైల్స్, స్థిరస్తి, చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను పరిశీలించారు. కష్టంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు స్వాంతన చేకూర్చాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని స్టేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి

వైరా: వైరా మున్సిపాలిటీ 4వ వార్డులో బస్టాండ్ వెనకాల ఎటువంటి అనుమతులు లేకుండా మూడంతస్తుల భవనం నిర్మిస్తున్నారని, అదే విధంగా 10వ వార్డులో డీటీసీపీ అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు వెంచర్ ఏర్పాటు చేశారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ధర్నా నిర్వహిస్తున్న నందినితో ఎస్ఐ భాగ్యరాజ్ మాట్లాడి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో గండగలపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చైతన్యరెడ్డి

మధిర: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం జరిగిన అండర్-17 సీనియర్ బాలికల ఖోఖో పోటీల్లో సిరిపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని వి.చైతన్య రెడ్డి ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్, పీఈటీ వై.కోటి, టీమ్ కన్వీనర్ మన్నేపల్లి గురునాథం తెలిపారు. ఈ సదర్భంగా పాఠశాల హెచ్ఎం మురళీమోహన్, సలీం, గ్రామ పెద్దలు చైతన్య రెడ్డిని అభినందించారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం నుంచి వచ్చిన యూనిఫాంను విద్యార్థులకు సోమవారం హెచ్ఎం జంగా గురునాధరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, శివాలయం కమిటీ చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి, అంకమ్మ తల్లి ఆలయ పూజారి వేమిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

పత్తితీతలు ఆరంభం

- ఏర్పాటు కాని సీసీఐ కేంద్రం
- ప్రైవేట్ వ్యాపారులకే విక్రయాలు
- వర్షాల కారణంగా అంతంత మాత్రంగానే దిగుబడి
- నష్టపోతున్న రైతులు



వ్యాన్‌లో వచ్చిన పత్తిని కాటా వేస్తున్న దృశ్యం



మొదటి సారి తీతకు వచ్చిన పత్తి పైరు



ప్రైవేట్ కౌంటరులో రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి

తల్లాడ: మెట్ట పంటల్లో ప్రధానమైనది పత్తి పంట. పత్తి పైరులో ప్రస్తుతం మొదటి తీతలు ప్రారంభమయ్యాయి. ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో పత్తి పైరుపై ఆశలు పెంచుకున్న రైతులకు నిరాశే మిగులుతుంది. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా దిగుబడి బాగా తగ్గింది. మొదటి తీతలో తక్కువగానే దిగబడి వస్తోంది. దీనికి తోడు సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రం ఇంకా ఏర్పాటు చేయక పోవటంతో రైతులు మరింత నష్టపోతున్నారు. ప్రైవేట్ వ్యాపారులకే తీసిన పత్తిని విక్రయించుకోవాల్సి వస్తోంది. వ్యాపారులు పత్తి తేమ శాతం చూడకుండానే రంగు, నాణ్యతను చూసి ధర నిర్ణయిస్తున్నారు. అదే సీసీఐ కేంద్రంలో తేమశాతాన్ని పరికరం ద్వారా తీసీ రైతుకు ధర నిర్ణయిస్తారు. పెట్టుబడులు పెట్టిన రైతులు బాకీలు తీర్చేందుకు పత్తిని అమ్మేయాల్సి వస్తుంది.

6,500 ఎకరాల్లో పత్తి సాగు..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో తల్లాడ మండలంలో ఆరు వేల ఐదువందల ఎకరాల్లో పత్తి పైరు సాగు చేశారు. గత జూన్ నెలలో సాగు చేసిన పత్తి మొదట్లో వర్షాలు లేక అంతంత మాత్రంగా ఎదిగింది. ఆ తర్వాత జులై నెలలో వర్షాలు ఊపందుకున్నాయి. ఆగస్టు నెల నుంచి అక్టోబర్ వరకు కూడా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పైరు ఎర్రబారి పోయింది. తల్లాడ, అన్నారుగూడెం, మల్లవరం, పినపాక, బిల్లుపాడు, మిట్టపల్లి, ముద్దునూరు, కుర్నవల్లి, కలకొడిమ, బస్వాపురం, కేశ్వాపురం, రెడ్డిగూడెం, మంగాపురం, కొడవటిమెట్ట, అంబేడ్కర్ నగర్, రంగం బంజర గ్రామాల్లో పత్తి పైరు తేమశాతం అదికమై ఎర్రబడింది.

తగ్గిన దిగుబడి..

ఈ ఏడాది అధిక వర్షాలు కారణంగా పత్తి పైరులో దిగుబడి తగ్గింది. ముఖ్యంగా నల్ల రేగడి నేలలు నీరు నిలిచి పూత పిందె రాలిపోయింది. దీంతో మొదటిసారి ఎకరానికి రెండు, మూడు క్వింటాల్ మాత్రమే దిగుబడి వస్తోంది.

ఏర్పాటు కానీ సీసీఐ కేంద్రం..

తల్లాడలోని కొత్తగూడెం రోడ్డులో జిన్నింగ్ మిల్‌లో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇంకా సీసీఐ కేంద్రం ఏర్పాటు కాక పోవడంతో రైతులు మరింత నష్టపోతున్నారు. సీసీఐ కేంద్రంలో ప్రభుత్వ మద్దతు ధరలు ఈ విధంగా ఉన్నాయి. తేమ శాతం 8 ఉంటే క్వింటా పత్తికి రూ.7,521, 9ఉంటే 7,444, 10శాతం ఉంటే 7,370, 11శాతంకు 7,295, 12శాతంకు 7,220 రూపాయలు చొప్పున ధర చెల్లించాలి. అదే ప్రైవేట్‌లో పత్తిని బట్టి రూ.7వేలకే కొంటున్నారు. తల్లాడలో కొత్తగూడెం రోడ్డు, కల్లూరు రోడ్డులో పత్తి కౌంటర్లు ఏర్పాటు చేసుకొని పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలనీ రైతులు కోరుతున్నారు.

ఎకరానికి రూ.40 వేల వరకు పెట్టుబడి..

పత్తి పైరుకు ఖరీఫ్ సీజన్‌లో ఎకరానికి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కలిపి 40 వేల వరకు పెట్టుబడి అయింది. పత్తి ఆరంబంలోనే దిగుబడి నామ మాత్రంగా ఉండటంతో రెండో సారి పత్తి తీతలపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. చలి కాలం పత్తి దిగుబడి పెరుగుతుందనీ భావిస్తున్నారు. వర్షాలు తగ్గితే పత్తికి అనుకూలంగా ఉంటుంది.

సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి..



పత్తి తీతలు ప్రారంభమైనందున తల్లాడలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయకపోతే.. ప్రైవేట్ వ్యాపారులకే పత్తిని విక్రయించుకోవాల్సి వస్తోంది.

– దగ్గుల వెంకట్‌రెడ్డి, రైతు, తల్లాడ

వర్షాలలో తగ్గిన దిగుబడి..



పత్తి రెండెకరాల్లో సాగు చేశాను. అధిక వర్షాలు కారణంగా పత్తి దిగుబడి తగ్గింది. మొదటిసారి పత్తి తీతలో నామ మాత్రంగానే దిగుబడి వస్తోంది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– కొమ్మినేని సత్యం, రైతు, లక్ష్మీనగర్

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి



పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేశ్వరరావు

సత్తుపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎస్ఏ-1(సమ్మేటీవ్ అసెస్మెంట్-1) పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో ఈ పరీక్షల తీరును ఎంఈఓ రాజేశ్వరరావు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయాలలో మాత్రమే పరీక్షలు నిర్వహించాలని, టైంటేబుల్ పాటించాలని హెచ్ఎంలను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పాఠశాల తప్పని సరిగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల అసలైన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ముందుగానే పరీక్షలు నిర్వహించటం, ప్రశ్నాపత్రాలు, సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా ఇతరులకు చేరవేయటం వంటి లీకేజీలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖాధికారి వీరపనేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి.. నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి.. వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రేమ్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

అవినీతిపై విచారణ జరపాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు

వైరా: వైరా మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వేణుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో అధికార పార్టీ నాయకులు అధికారులను బెదిరించి అక్రమ పద్ధతులలో బిల్లులు పెట్టుకుని ప్రజా ధనాన్ని లూటీ చేశారన్నారు. పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొంతు రాంబాబు, మద్దెల రవి, సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, సుధీర్, గోపీ, నరసింహారావు, సుధాకర్, సాంబశివరావు, రామకృష్ణ, మధు, రాములు తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌కు హామీ



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు హనుమంతరావు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలును నిలపాలని కోరుతూ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సోమవారం ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి హనుమంతరావు హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. సమస్య తీవ్రతను వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైలును అక్కడ ఆపేందుకు కేంద్రమంత్రి హామీ ఇచ్చారని హనుమంతురావు విలేకరులకు తెలిపారు.

శీలం నాగిరెడ్డికి నివాళులర్పించిన ఎంపీ

తల్లాడ: మండలంలోని రామానుజవరం గ్రామంలో శీలం నాగిరెడ్డి చిత్ర పటానికి సోమవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆయన దశదినకర్మకు హాజరై నాగిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడికి..

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బొగ్గుల కృష్ణారెడ్డి చిత్రపటం వద్ద పలువురు నాయకులు సోమవారం నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, పాట్టేటి జనార్దన్‌రెడ్డి, గొడుగునూరి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీరెడ్డి, కటికి కిరణ్, దగ్గుల రఘుపతిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, మూకర ప్రసాద్, కంచె సాను వెంకటేశ్వర్లు, మూకర చార్లెస్ తదితరులు నివాళులర్పించారు. కుటుంభ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిధుల మంజూరుపై హర్షం

కొణిజర్ల: కొణిజర్ల నుంచి తనికెళ్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించడంపై వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు కృతజ్ఞతలు తెలిపారు. కొణిజర్ల రామాలయం సెంటర్ నుంచి తనికెళ్ల సీపీఐ ఆఫీస్ సెంటర్ వరకు 4 కి.మీ. మేర రహదారికి నిధులు మంజూరు చేయించడంపై ఆయన సోమవారం ఎమ్మెల్యేను సన్మానించారు. నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, కొలిపాక వెంకటేశ్వర్లు, రేపాల వెంకటి తదితరులున్నారు.

రోహిణి నక్షత్ర పూజలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతాజ్ఞాన మందిరంలో గల పార్ధసారధిస్వామి ఆలయంలో స్వామి తిరునక్షత్రమైన రోహిణి నక్షత్రం సందర్భంగా సోమవారం నవకలశ స్నపన పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, కొత్తూరు రాజా, ఏపూరి పురుషోత్తం, తిరునగరి వెంకటనర్సయ్య, కొనకళ్ల శంకర్‌రావు, శారద, లక్ష్మి పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల సందడి



ఆలయం వద్ద మాలధారులు

ఏన్కూరు: మండలంలో అయ్యప్ప భక్తుల సందడి నెలకొంది. అన్ని గ్రామాల్లో సుమారు 400మంది భక్తులు మాలలు ధరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అయ్యప్ప భక్తుల సందడి చేస్తున్నారు. తూతకలింగన్నపేటలో 75 మంది మాలలు ధరించారు.

ప్రజావాణిలో మూడు దరఖాస్తులు

ముదిగొండ: ముదిగొండ మండలపరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలకు సంబందించి రెండు, ఇంటిస్థలానికి సంబందించి ఒకటి మొత్తం మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సునీత ఎల్లిబెత్ తెలిపారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి

చింతకాని: రైతు భరోసా నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్ల య్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం వానాకాలం రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. అనంతరం తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, మండల నాయకులు గురిజాల హనుమంతురావు, గడ్డం శ్రీను, నర్సయ్య, షిలార్ సాహెబ్, షేక్ జానిమియా, కొండలరావు పాల్గొన్నారు.

వచ్చే ఏడాదికల్లా కళాశాలకు నూతన భవనం



డాక్టర్ మట్టా దయానంద్‌ను సత్కరిస్తున్న కళాశాల ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: ఈ కళాశాలలోనే చదివి డాక్టర్‌ను అయ్యి ఉన్నత స్థితికి వచ్చాను.. కానీ ఇప్పుడు కళాశాల దుస్థితిని చూస్తుంటే బాధేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. సోమవారం సత్తుపల్లి ఎస్‌బీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. బాలికల కళాశాల అధ్యాపకురాలు దారా ప్రమీల రూ.20వేల వితరణతో అందించిన దుస్తులను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ముందుగా ఎన్ఎస్ఎస్ అధ్వర్యాన కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్న ఈ కళాశాలను వచ్చే ఏడాదికల్లా కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కళాశాలలోని మెరిట్ విద్యార్థుల కోసం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఏటా రూ.లక్ష వితరణగా అందించనున్నట్లు ప్రకటించారు. అనంతరం కళాశాల సిబ్బంది దయానంద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ బి.భాగ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌బాబు, సొసైటీ ఉపాధ్యక్షుడు గాదె చెన్నారావు, ఎండీ కమల్‌పాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవం



పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న కమాండెంట్ పీజేపీసీ చటర్జీ, ఉద్యోగులు

15వ బెటాలియన్‌లో..

సత్తుపల్లిరూరల్: గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ చటర్జీ పాల్గొని విధి నిర్వహణలో అశువులు బాసిన వారికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్మృతిపరేడ్ ద్వారా పోలీసు అమర వీరులకు గౌరవ వందనాన్ని సమర్పించారు. కమాండెంట్ చటర్జీ మాట్లాడుతూ.. దేశంలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ దేశం కోసం, సమాజం కోసం అమరులైన వారి స్మరిస్తూ వారి జ్ఞాపికంగా అక్టోబర్ 21న వారికి శ్రద్ధాంజలి ఘటించడం గౌరవ కార్యక్రమమని వివరించారు. అదే విధంగా సంఘ విద్రోహులను ఎదుర్కొనేందుకు వారి నుండి సమాజాన్ని కాపాడేందుకు పోలీసులు ఎప్పుడు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డి రంగారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌లో..

ఏన్కూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీసులు అమరవీరుల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రఫీ, కానిస్టేబుల్, సైద, శీను పాల్గొన్నారు.

ఆలియాతండాకు ట్రైయినీ అధికారులు



ట్రైయినీ అధికారులతో ఉద్యోగులు

కారేపల్లి: కారేపల్లి మండలం ఆలియాతండా గ్రామానికి ఐదుగురు ట్రెయినీ సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం సోమవారం రాత్రి చేరుకుంది. ప్రజల ఆహారపు అలవాట్లు, స్థితిగతులు, ఆచార వ్యవహారాలపై ఈ బృందం ఐదు రోజుల పాటు వీరు అధ్యయనం చేయనున్నారు. బృందంలో తేజస్విని తబాని, అనితామీనా, వైభవ్‌మీనా, అల్తామాష్ ఘాజీ, విపుల్ సింఘాల్ ఉండగా, వీరికి ఎంపీడీఏ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, సూపరింటెండెంట్ రమేష్, గ్రామకార్యదర్శి అనిల్‌కుమార్ స్వాగతం పలికారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

కొణిజర్ల: ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా, ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్, ఎంపీడీఓ ఏ.రోజారాణి, ఏఓ బాలాజీ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై ఐకేపీ, డీసీఎంఎస్, సహకార సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. కొణిజర్ల మండలంలో 14 సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఐకేపీ ద్వారా 11, పీఏసీఎస్ కొణిజర్ల వారు 2, డీసీఎంఎస్ ఖమ్మం వారు ఒక సెంటర్‌లో కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ చేపట్టిన ధాన్యం కొనుగోళ్ల, కాటాల వివరాలు ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో కావలసిన మౌళిక సదుపాయాలు, వర్షం వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుశీల తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం..

కల్లూరురూరల్: పాలక ప్రభుత్వాలు గిరిజన చట్టాలు, హక్కులను కాలరాస్తూ అన్యాయం చేస్తున్నాయని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దశరథ్ నాయక్ అన్నారు. సోమవారం గిరిజనుల హక్కుల సాధనకై ఉద్యమానికి సిద్ధం కావాలని లంబాడి హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్ పిలుపునిచ్చారు. మైదాన ప్రాంతంలో నివసిస్తున్న ఎస్టీల కోసం ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలన్నారు. సమస్యల సాధనకు ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో నంగారాభేరి రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ కృష్ణనాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గుగులోత్ కిషన్‌నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నందునాయక్, గిరిజన నాయకులు భూక్యా రవినాయక్, జానకిరామ్‌నాయక్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చింతకాని: మండలంలోని నేరడకు చెందిన కనకపూడి నాగయ్యకు సీఎం సహాయనిధి నుంచి రూ.45వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కును సోమవారం నాగయ్య భార్య యశోదకు సీపీఐ మండల సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు అందించారు. కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు ప్రభాకర్, ఆంథోని పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాగమయికి కృతజ్ఞతలు..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలో అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి సింగరేణి ఐఎన్‌టీయూసీ నాయకులు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి క్రాంతికుమార్, సీనియర్ నాయకులు చెన్నకేశవరావు, ఫిట్ సెక్రటరీలు రామారావు, బాలాజీ, నాగేశ్వరరావు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, ఐవి రెడ్డి, సురేష్, రషీద్, తిరుమలరావు, రమేష్, సుందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి అవార్డు



ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న మౌలాలీ

కల్లూరురూరల్: కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఎం.డి.మౌలాలీ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. గత పదేళ్లుగా నిరుపేద విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయనకు శారద ఎడ్యుకేషన్ సొసైటీ ట్రస్ట్ బాధ్యులు హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మౌలాలీని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

లంకాసాగర్ పీహెచ్‌సీకి బెడ్ వితరణ

పెనుబల్లి: మండలంలోని లంకాసాగర్ పీహెచ్‌సీకి యడ్లబంజర్ గ్రానికి చెందిన యడ్ల హర్షిత పుట్టిన రోజు సందర్భంగా ఆమె తల్లి జ్ఞాపకార్థం సోమవారం బెడ్‌ను వితరణగా అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా గర్భిణులకు ఉపయోగపడే విధంగా రూ.20 వేల విలువైన బెడ్‌ను ఆస్పత్రికి అందించారు. అనంతరం హర్షిత కుటుంబసభ్యులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, యడ్ల వెంకటేశ్వరరావు, యడ్ల నరసింహారావు, బన్నే భద్రయ్య, వనమా సాయి , యడ్ల సుమంత్, రామిశెట్టి మనోహర్ నాయుడు, వైద్య సిబ్బంది నాగేశ్వరరావు, పోలమ్మ, పాషా తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్‌లో నమోదు చేయాలి

తల్లాడ: తల్లాడ పీహెచ్‌సీ పరిధిలోని ఆశా కార్యకర్తలు ఇకపై నిర్వహించే వైద్య సేవలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. సోమవారం తల్లాడ పీహెచ్‌సీలో ఆశ రిజిస్టర్లు అందించి మాట్లాడారు. ఈ రిజిస్టర్లు గర్భిణులు, చిన్న పిల్లల దగ్గర నుంచి మొత్తం 17 అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తెలపాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాస్కర్, పెద్ద పుల్లయ్య, కమల, భద్రమ్మ, రూసీ, లక్ష్మి పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990
వైరా ఐ. రాందాస్ - 98898 81843
రమేష్, ACO - 9059115968
మధిర వీరబాబు - 98498 64638
సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

రవికుమార్ - 99499 27792
ఎస్. జయరాజు - 96528 68642